క్లుప్తంగా

దుకాణాలకు రిజిస్ట్రేషన్ తప్పనిసరి


శ్రీనివాసరావు

రణస్థలం:ఏపీ దుకాణాలు, వ్యాపార సంస్థల చట్టం ప్రకారం దుకాణాలకు తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, అలాగే పాతవాటిని రెన్యువల్ చేసుకోవాలని శ్రీకాకుళం సర్కిల్ -2 కార్మికాధికారి ఆర్.వి.శ్రీనివాసరావు తెలిపారు. రణస్థలంలో దుకాణాల రిజిస్ట్రేషన్లపై శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళం, ఎచ్చెర్ల, రణస్థలం, లావేరు మండల పరిధిలో ఉన్న దుకాణ యజమానులు మీ సేవా కేంద్రాలు, గ్రామ, వార్డు సచివాలయాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకోవచ్చునని అన్నారు.

లాండ్రీ దుకాణంలో చోరీ

రణస్థలం: మండల కేంద్రంలోని ఆర్టీసీ వాణిజ్య సముదాయంలో ఉన్న లాండ్రీ దుకాణంలో గురువారం రాత్రి చోరీ జరిగింది. అదపాక లక్ష్మణరావుకు చెందిన దుకాణం పైన రేకుకు కన్నం చేసి అందులో ఉన్న రెండు ఇత్తడి ఇస్త్రీ పెట్టెలు, విలువైన వస్త్రాలను దొంగలు పట్టుకొని వెళ్లిపోయారు. శుక్రవారం ఉదయం దుకాణానికి వెళ్లిన లక్ష్మణరావు చోరీ జరిగిన విషయాన్ని గుర్తించి జె.ఆర్.పురం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

25న ఆలయ వార్షికోత్సవం


మాట్లాడుతున్న బాలకృష్ణ

ఎచ్చెర్ల: లింగాలపేట గ్రామంలోని షిర్డీ సాయిబాబా ఆలయ సన్నిధిలో ఈ నెల 25వ తేదీన అష్టమ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించనున్నామని ఆలయ సేవా ట్రస్ట్ చైర్మన్ సనపల బాలకృష్ణ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం వివరాలను వెల్లడించారు. భక్తులు అధికసంఖ్యలో తరలివచ్చి స్వామివారిని దర్శించుకోవాలని కోరారు.

వేణుగోపాలుని కల్యాణోత్సవం నేడు


కాళీయమర్దన వేణుగోపాలుడు

గార: శ్వేతగిరి(శాలిహుండం)పై కొలువుదీరిన కాళీయమర్దన వేణుగోపాలుని కల్యాణోత్సవం నవవాహ్నిక దీక్షతో శనివారం ఉదయం ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్నట్లు కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో తెలిపారు. తొమ్మిది రోజులుగా జరుగుతున్న జాతరలో భాగంగా మాఘ శుద్ధ పౌర్ణమి వేళ రుక్మిణీ సత్యభామ సమేత కాళీయ మర్దన వేణుగోపాలుని కల్యాణోత్సవంతో పాటు శ్రీలక్ష్మీ, భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి కల్యాణం అంగరంగ వైభవంగా జరగనుందని, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

దేవీ ఆశ్రమంలో ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న బాలభాస్కరశర్మ

ఎచ్చెర్ల: కుంచాలకుర్మయ్యపేటలోని దేవీ ఆశ్రమంలో శుక్రవారం పలు ప్రత్యేక పూజలు జరిగాయి. ఇక్కడ ఉన్న అమ్మవారికి పీఠాధిపతి బాలభాస్కరశర్మ అభిషేకాలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. శ్రీచక్రాల వద్ద కుంకుమ పూజల్లో అధికసంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

25 నుంచి 'హ్యాపీనెస్'

శ్రీకాకుళం కల్చరల్: పీఎన్ కాలనీలో ఈ నెల 25, 26 తేదీల్లో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఆధ్వర్యంలో హ్యాపీనెస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు సుధారాణి, కేఎస్ఎన్ మూర్తి ఒక ప్రకటలో తెలిపారు. అంతర్జాతీయ ఫ్యాకల్టీ తేజ బోధించనున్నారని,వివరాలకు 9985034758, 9440332380 నంబర్లను సంప్రదించాలని కోరారు.

గ్రామాల ప్రగతే లక్ష్యం

ఎచ్చెర్ల క్యాంపస్: గ్రామాల ప్రగతే లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తుందని బీజేపీ ఎచ్చెర్ల నియోజకవర్గ కోకన్వీనర్ సంపతరావు నాగేశ్వరావు అన్నారు. ఎస్.ఎం.పురం, కేశవరావుపేట, చిలకపాలెం, అల్లినగరం గ్రామాల్లో శుక్రవారం ప్రజాపోరు కార్యక్రమాన్ని నిర్వహించారు. నాయకులు తమ్మినేని గోవిందరావు, పుణ్యపు శంకరరావు, వావిలపల్లి చంద్రరావు పాల్గొన్నారు.

జై భారత్ నేషనల్ పార్టీ లీగల్ సెల్ కన్వీనర్‌గా చౌదరి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జై భారత్ నేషనల్ పార్టీ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్, అధికార ప్రతినిధిగా న్యాయవాది చౌదరి లక్ష్మణరావు నియమితులయ్యారు. ఈ మేరకు పార్టీ అధ్యక్షుడు వి.వి.లక్ష్మీనారాయణ నియామక పత్రాన్ని శుక్రవారం అందజేశారు.

నాడు శిథిల బడి.. నేడు సగర్వంగా నిలబడి


నేడు: పూర్తిస్థాయి సౌకర్యాలతో జగన్నాథవలస ప్రాథమికోన్నత పాఠశాల

- మారిన జగన్నాథవలస ప్రాథమికోన్నత పాఠశాల రూపురేఖలు
- దశాబ్దాల దుస్థితికి స్వస్తి పలికిన జగనన్న సర్కారు
- ఆనందంలో విద్యార్థులు

ఇది కదా.. అభివృద్ధి


నాడు: శిథిలావస్థకు చేరిన భవనంలో పాఠాల బోధన(ఫైల్)

జి.సిగడాం: మనబడి నాడు-నేడు పథకం అద్భుతాలు సృష్టిస్తోంది. దశాబ్దాలుగా నిరాదరణకు గురైన ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలను సమూలంగా మార్చేస్తోంది. కార్పొరేట్‌కు దీటుగా సకల సౌకర్యాలు కల్పిస్తూ బడి అంటే ఇలా ఉండాలంటూ అందరితో కితాబునందుకుంటోంది. జి.సిగడాం మండలం జగన్నాథవలస ప్రాథమికోన్నత పాఠశాలకు తొమ్మిది దశాబ్దాల చరిత్ర ఉంది. పురాతన బడి కావడంతో చినుకుపడితే తరగతి గదుల్లో నీరు నిలిచిపోయి విద్యార్థులు, ఉపాధ్యాయులు ఇబ్బందులు పడేవారు. 80 మంది విద్యార్థులకు మూడే గదులు ఉండటం, అవి కూడా శిథిలావస్థకు చేరడంతో అవస్థలు పడేవారు. గత పాలకులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోలేదు.

నాడు-నేడుతో మహర్దశ..

జగనన్న ముఖ్యమంత్రి అయ్యాక పాఠశాలకు మహర్దశ పట్టింది. నాడు-నేడు పథకం కింద పక్కా భవనాలు, తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించడంతో విద్యార్థుల ఇబ్బందులు తొలిగాయి. ఉపాధ్యాయుల కృషి విద్యార్థులు చక్కగా చదువుకుంటున్నారు.

ఆనందంగా ఉంది..


గతంలో సరైన వసతులు లేక ఇబ్బందులు పడ్డాం. గదులు పెచ్చులూడేవి. జగన్ మామయ్య వచ్చాక మౌలిక సదుపాయాలు కల్పించారు. ఆనందంగా చదువుకుంటున్నాం.
– కొయ్యాన షర్మిల, 8వ తరగతి, జగన్నాథవలస యూపీస్కూల్

పూర్తిస్థాయిలో సౌకర్యాలు


పాఠశాలలో పూర్తిస్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పించారు. మరుగుదొడ్లు, తాగునీరు, విద్యా బోధనకు అవసరమైన బోర్డులు మంజూరు చేశారు.
– కుప్పిలి పద్మావతి పట్నాయక్, హిందీ టీచర్

మెరుగైన బోధన


పాఠశాలలో అన్ని మౌలిక సదుపాయాలు సీఎం జగన్ కల్పించారు. జగనన్న గోరుముద్దను పిల్లలు ఇష్టంగా తింటున్నారు. విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నాం.
– బుల్లా స్వాతి, ఉపాధ్యాయురాలు, జగన్నాథవలస

నాడు-నేడుతో అభివృద్ధి..


పాఠశాలలో వసతులు, అదనపు భవనాల కోసం ప్రభుత్వం మరో రూ.8 లక్షలు నిధులు మంజూరు చేసింది. ప్రస్తుతం రెండు భవనాలు నిర్మిస్తున్నాం.
– గోకవరపు వెంకటరమణ, హెచ్ఎం, జగన్నాథవలస యూపీ స్కూల్

వైభవంగా శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు


బలగ నాగావళి తీరంలోని బాలాత్రిపుర కాలభైరవపీఠం దేవాలయంలో మాఘ పౌర్ణమి సందర్భంగా శ్రీచక్ర సిరిజ్యోతి పూజలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. పీఠం నిర్వాహకులు గణేష్ గురూజీ ఆధ్వర్యంలో మహిళలు శ్రీచక్రంపై దీపాలు వెలిగించారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.
– శ్రీకాకుళం కల్చరల్

విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వాలి

- జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సన్యాసినాయుడు



మాట్లాడుతున్న సన్యాసినాయుడు

ఎచ్చెర్ల క్యాంపస్: న్యాయ శాస్త్రం (ఎల్ఎల్బీ) చదువుతున్న విద్యార్థులు విషయ పరిజ్ఞానానికి ప్రాధాన్యం ఇవ్వాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి ఆర్.సన్యాసినాయుడు అన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని మహాత్మా జ్యోతీరావుపూలే న్యాయ కళాశాలలో శుక్రవారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగం పౌరులకు సమాన హక్కులు కల్పించిందని అన్నారు. ఎదుటి వారి హక్కులకు భంగం వాటిల్లకుండా ప్రతిఒక్కరూ తమ స్వేచ్ఛను అనుభవించాలని అన్నారు. సమాజంలో న్యాయ అక్షరాస్యతను పెంపొందించేలా ఎల్ఎల్బీ విద్యార్థులు కృషిచేయాలని సూచించారు. ప్రతి విద్యార్థి లక్ష్యంతో చదవాలని అన్నారు. న్యాయ శాస్త్రంపై పూర్తిస్థాయిలో పట్టు, ప్రస్తుతం కోర్టుల్లో వస్తున్న తీర్పులు, సామాజిక సమస్యలు, కొత్తగా చేస్తున్న చట్టాలు తెల్సుకోవాలని అన్నారు. న్యాయవాదులుగా, న్యాయ శాఖలో అధికారులతో, న్యాయ సహాయకులుగా అనేక అవకాశాలు విద్యార్థులకు ఉన్నాయని చెప్పారు. మిగత విద్యకు న్యాయ విద్యకు తేడా ఉందని, న్యాయ విద్యార్థులు సమాజ ప్రగతి, పౌర హక్కుల కోసం కృషి చేయాలని తెలిపారు. న్యాయ కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జేకేఎల్ సుజాత, డాక్టర్ టంకాల బాలకృష్ణ, న్యాయవాది గేదెల ఇందిరా ప్రసాద్ పాల్గొన్నారు.

నిస్వార్థ సేవకులు వలంటీర్లు


అరసవల్లి సచివాలయ వలంటీర్లతో అంధవరపు సూరిబాబు


చాపురం పంచాయతీ పరిధిలో వలంటీర్లకు సన్మానం

శ్రీకాకుళం రూరల్: వలంటీర్లు నిస్వార్థ సేవకులని రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. అరసవల్లి సచివాలయంలో శుక్రవారం వలంటీర్లకు వందనం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా జగనన్న అందిస్తున్న సంక్షేమ పథకాలను నిష్పక్షపాతంగా, పారదర్శకంగా ప్రజలకు అందించడంలో వలంటీర్లు కీలక పాత్ర పోషిస్తున్నారని ప్రశంసించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, జేఎం శ్రీనివాస్, తెలుగు రమేష్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. చాపురం పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న వలంటీర్లకు పార్టీ నాయకుడు అల్లు లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో సన్మానాలు చేశారు.

వలంటీర్లకు సత్కారం

జి.సిగడాం: పెంట గ్రామ సచివాలయంలో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో వలంటీర్లకు సత్కారం జరిగింది. సర్పంచ్ పున్నాన సోనియా, ఎంపీటీసీ సభ్యురాలు మక్క శ్రీలత, ఉప సర్పంచ్ ఉర్రంకుల సత్యన్నారాయణ, వైఎస్సార్‌సీపీ నాయకులు పున్నాన అక్కలనాయుడు, మక్క శ్రీనివాసరావు వలంటీర్లను సత్కరించి అభినందించారు.


జి.సిగడాం: సత్కారం పొందిన వలంటీర్లు

విశ్రాంత వీఆర్‌వో మృతికి సంతాపం


మార్పు బాబ్జీ (ఫైల్)

గార: విశ్రాంత వీఆర్‌వో, జెడ్పీ మాజీ ఉపాధ్యక్షుడు మార్పు ధర్మారావు సోదరుడు మార్పు బాబూజీ రావు (బాబ్జీ)గురువారం రాత్రి మృతి చెందారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్ సీపీ నేత ధర్మాన రామ్‌మనోహర్ నాయుడు శుక్రవారం గార వెళ్లి బాబ్జీ పార్థివదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుమారుడు దుర్గాప్రసాద్‌ను ఓదార్చారు. ఎంపీపీ గొండు రఘురామ్, డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, ముంజేటి కృష్ణమూర్తి, పార్టీ కన్వీనర్ పీస గోపి, ఎంపీటీసీ ఆరంగి రమణమూర్తి, జల్లు గౌరిపతి నాయుడు తదితరులు పరామర్శించారు.

సంతోషిమాతకు విశేష పూజలు



శ్రీకాకుళం కల్చరల్: పాత శ్రీకాకుళంలోని సంతోషి మాత అమ్మవారి ఆలయంలో మాఘ శుద్ధ చతుర్దశి శుక్రవారం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అర్చకులు మోదుకూరి కిరణ్ శర్మ నేతృత్వంలో తెల్లవారుజామున మూలవిరాట్టుకు నమక చమక సహిత పంచ సూక్తాలతో అభిషేకాలు నిర్వహించి అష్టోత్తర శతనామాలతో కుంకుమ పూజలు చేశారు. మహానివేదన, మహా హారతి నిర్వహించి, భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. అమ్మవారిని సుగంధ పరిమళ పుష్పాలతో అలంకరించారు.

కబడ్డీ చాంపియన్‌గా శ్రీకాకుళం


మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా ట్రోఫీ అందుకుంటున్న జిల్లా బాలికల జట్టు

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీల్లో శ్రీకాకుళం జిల్లా క్రీడాకారులు సత్తాచాటారు. గుంటూరు జిల్లా సత్తెనపల్లి వేదికగా ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగిన ఏపీ రాష్ట్రస్థాయి సబ్-జూనియర్స్ బాలబాలికల కబడ్డీ చాంపియన్‌షిప్ పోటీల్లో శ్రీకాకుళం బాలికల జట్టు చాంపియన్‌గా నిలిచి జిల్లాకు గర్వకారణంగా నిలిచింది. మంత్రి అంబటి రాంబాబు చేతులమీదుగా క్రీడాకారులు ట్రోఫీ, పతకాలను అందుకున్నారు. జిల్లా జట్టు రాణింపు పట్ల జిల్లా కబడ్డీ, బీచ్ కబడ్డీ అసోసియేషన్ చైర్మన్ డాక్టర్ సీదిరి అప్పలరాజు, అధ్యక్షుడు ధర్మాన రామలింగంనాయుడు, కార్యదర్శి సాధు శ్రీనివాసరావు, ఒలింపిక్ సంఘ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, కార్యదర్శి ఎం.సాంబమూర్తి, సలహాదారు పి.సుందరరావు, పీఈటీ సంఘ నాయకులు ఎం.వి.రమణ, పోలినాయుడు హర్షం వ్యక్తం చేశారు.

ఎన్నికల నోడల్ అధికారుల నియామకం

శ్రీకాకుళం పాతబస్టాండ్: ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ ఎన్నికలకు సంబంధించి వివిధ యాప్‌లు, వెబ్‌సైట్‌లను నిర్వహించేందుకు నోడల్ అధికారులను నియమించారు. ఎన్నికల కమిషన్ వివిధ రకాల యాప్‌లు, వెబ్ సైట్‌లను ఎన్నికల కోసం వినియోగించాలని ఆదేశించింది. ఈ మేరకు యాప్, వెబ్ సైట్‌లకు నోడల్ అధికారులను నియమించారు.

ప్రభుత్వ జూనియర్ కళాశాలకు వితరణ


సీసీ కెమెరా సిస్టమ్‌ను ప్రారంభిస్తున్న బి.ఎర్రన్న


గ్రీన్ బోర్డులను ప్రారంభిస్తున్న కళాశాల పూర్వ విద్యార్థులు

గార: కె.మత్స్యలేశంలోని కళింగపట్నం కోకా వారి ప్రభుత్వ జూనియర్ కళాశాలకు అదే కాలేజీలో చదివిన ఓల్డ్ బాయ్స్ అసోసియేషన్ ప్రతినిధులు రూ.40 వేలు విలువైన 8 గ్రీన్‌బోర్డులను అందజేశారు. వీటిని కెప్టెన్ ఎర్రన్న, వాసుపల్లి కృష్ణమూర్తి, బి.ఎర్రన్నలు శుక్రవారం ప్రారంభించారు. అదేవిధంగా రూ.35 వేలు విలువైన సీసీ కెమెరాలను సర్పంచ్ బుడ్డా లలితాఎర్రన్న, గుంటు శ్రీనివాసరావు, హరిహరరెడ్డిలు అందజేశారు. స్టేజీ పోడియమ్‌ను బి.ఎర్రన్న, రెండు కంప్యూటర్లను, ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థులకు రూ.50 వేలు విలువైన యూనిఫామ్‌లను కేజీజేసీ వెల్ఫేర్ అసోషియేషన్ ప్రతినిధులు అందజేశారు. మంత్రి ధర్మాన ప్రసాదరావు చొరవతో రూ.1.93 కోట్ల నిధులతో నిర్మించిన నూతన భవన సముదాయాన్ని ఇటీవలే ప్రారంభించిన సంగతి తెలిసిందే. దాతలకు కళాశాల ప్రిన్సిపాల్ కె.అప్పలరాం, ఇన్‌చార్జి మావూరు ఇందిర, సిబ్బంది, విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

సకాలంలో ఇళ్ల నిర్మాణాలు పూర్తి


సిబ్బందితో సమీక్షిస్తున్న ఏఈ రాజేంద్రప్రసాద్

ఎచ్చెర్ల క్యాంపస్: ఎచ్చెర్ల మండలంలో సకాలంలో వైఎస్సార్, జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తికావాలని మండల హౌసింగ్ ఏఈ ఉరిటి రాజేంద్రప్రసాద్ అన్నారు. ఎచ్చెర్ల గృహ నిర్మాణశాఖ కార్యాలయంలో శుక్రవారం గ్రామ సచివాలయ ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. మండలంలోని 28 గ్రామ సచివాలయాలు పరిధిలో 1292 మందికి ఇళ్ల పట్టాలు ప్రభుత్వం అందజేయగా.. 386 ఇళ్ల నిర్మాణం పూర్తయినట్లు చెప్పారు. 505 నిర్మాణంలో ఉన్నాయని, మిగిలిన 401 ఇళ్ల ప్రారంభించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. సకాలంలో బిల్లులు చెల్లిస్తున్నట్లు వివరించారు. కాలనీల్లో ప్రజలకు ఇబ్బంది లేకుండా పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పిస్తున్నామన్నారు. ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందు గృహ నిర్మాణాలు ప్రారంభించేందుకు ఇంజినీరింగ్ అసిస్టెంట్లు కృషి చేయాలని చెప్పారు. హౌసింగ్ వర్క్ఇన్‌స్పెక్టర్ సీపాన రాజేష్ పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శి లేక ఇబ్బందులు!

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట సచివాలయానికి గ్రామ కార్యదర్శి లేకపోవటంతో పౌర సేవలకు ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. ఇక్కడ గ్రామ కార్యదర్శిగా పని చేసిన షంషుబేగం గత నెల 31 నుంచి మెడికల్ లీవ్‌పై వెళ్లారు. దీంతో తమ్మినాయుడుపేట కార్యదర్శి జగదీష్‌కు ఇన్‌చార్జి బాధ్యతలను అధికారులు అప్పగించారు. అయితే ఆయన సైతం విధుల్లో చేరేందుకు ఇష్టపడటం లేదు. మెడికల్ లీవ్ పెడతానని అధికారులకు స్పష్టం చేశారు. ప్రస్తుతం గ్రామంలో మరణ, జనన ధ్రువీకరణ పత్రాలు జారీ, విద్యుత్ మీటర్ల మంజూరు వంటి పౌరసేవలు నిలిచి పోయాయి. ఈవోపీఆర్డీ ఈశ్వరి వద్ద ఈ విషయాన్ని ప్రస్తావించగా ఉన్నతాధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్లినట్టు చెప్పారు.

గ్రామాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం


మాట్లాడుతున్న లక్ష్మణరావు

జి.సిగడాం: గ్రామాల అభివృద్ధే వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ధ్యేయమని సంతవురిటి గ్రామ సర్పంచ్ బుడారి లక్ష్మణరావు అన్నారు. స్థానిక సచివాలయంలో ఉపాధి హామీ పథకం సామాజిక తనిఖీ బృందం ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామ సభలో ఆయన మాట్లాడారు. ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ కృషితో గ్రామంలో మౌలిక వసతులు కల్పించామన్నారు. ఇప్పటికే సచివాలయం, రైతు భరోసా కేంద్రం, హెల్త్ క్లినిక్, పార్కు, కమ్యూనిటీ హాల్‌ను ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బత్తుల సన్యాసిరావు, ఉప సర్పంచ్ చందనాల గణపతి, నాయకులు చందనాల రంగారావు, రామారావు, పంచాయతీ కార్యదర్శి హిమబిందు, డీఆర్‌పీ రాంజీ, నాగరాజు పావని, సచివాలయం సిబ్బంది ఉన్నారు.

వమరవల్లి సర్పంచ్ మృతికి సంతాపం


సర్పంచ్ భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఎంపీపీ రఘురామ్

గార: వమరవెల్లి సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు సుగ్గు లక్ష్మీభాయి (94) శుక్రవారం ఉదయం మృతి చెందారు. ఈమె పార్థివదేహానికి ఎంపీపీ గొండు రఘురామ్, తెనుకోటి అప్పారావులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. డీసీఎంఎస్ చైర్మన్ గొండు కృష్ణమూర్తి, అంధవరపు బాలకృష్ణ, అరవల రామకృష్ణ, యాళ్ల నారాయణమూర్తి, కొయ్యాన నాగభూషణం, ముంజేటి కృష్ణమూర్తి, బుడ్డా ఎర్రన్న, టి.అప్పలరాజు, జల్లు గౌరిపతినాయుడు తదితర సర్పంచ్‌లు, ఎంపీటీసీలు అంతిమయాత్రలో పాల్గొని నివాళులర్పించారు.